క్లుప్తంగా

పోలేరమ్మ దేవతకు పొంగళ్లు



పూజల్లో పాల్గొన్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరులో గ్రామ దేవత పోలేరమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారి మూలమూర్తికి పలు రకాల అభిషేక పూజలు, అలంకరణలు చేశారు. ఆలయ పైభాగంలో శిఖరాలకు పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. అమ్మవారి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

కాలువలు నిర్మించండి



వీధిలో నిల్వ ఉన్న మురుగునీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గ్రామంలో కాలువలు లేకపోవడంతో మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తోంది. దీంతో వీధులు బురదమయం అవుతున్నాయి. దోమలు, దుర్గంధంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విరబూసిన మామిడి పూత



బీఎన్‌కండ్రిగలో విరబూసిన పూత

బుచ్చినాయుడుకండ్రిగ : మంచుతో ఆలస్యమైనా మామిడి తోటల్లో పూత విరబూస్తోంది. మండలంలో 250 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. వాతావరణంలో మంచు విపరీతంగా ఉండడంతో డిసెంబర్, జనవరిలో రావాల్సిన పూత ఆలస్యమైంది. పూత దెబ్బతినకుండా ఉండేందుకు అధికారుల సూచనల మేరకు వివిధ రకాల మందులను పిచికారీ చేస్తున్నారు.

ఉపాధిలో భూముల అభివృద్ధి పనులు



పని చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరులో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని వివిధ రకాల పనులను 150 మంది కూలీలు చేస్తున్నారు. భూముల అభివృద్ధి, చెరువు కట్టపై చెట్టు పుట్టలను తొలగించే పనులను చేస్తున్నారు. ఈ పనులు నెలరోజుల పాటు ఉంటాయని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణయ్య తెలిపారు. కూలీలకు రోజుకు రూ.220 కూలి గిట్టుబాటు అవుతోందన్నారు.

22న మండల సమావేశం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22వ తేదీ ఉదయం 10గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.రఫీఖాన్ తెలిపారు. శాఖల వారీగా అభివృద్ధి పనుల సమీక్ష ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని తెలిపారు.

ఘనంగా మధ్వాచార్యుల జయంతి



కాణిపాకం(యాదమరి) : కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం ద్వైత మతం మధ్వాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి కల్యాణ వేదికలో మధ్వాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. జీవుడు, దేవుడు వేర్వేరని, జీవ, పరమాత్మ రెండుగా ఉంటాయని చెప్పే ద్వైతమతాన్ని మధ్వాచార్యులు నెలకొల్పారని వేదపండితులు వివరించారు. ఆయనను వాసుదేవుడి అంశగా భావిస్తారని పేర్కొన్నారు.

జగనన్నతో గ్రామ స్వరాజ్యం

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- రైతుల అభ్యున్నతికి పెద్దపీట
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధ్యమైందని, పలు అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల స్వరూపమే మారిపోయిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాపానాయుడుపేటలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా శ్రీద్రౌపదీధర్మరాజుల స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అభివృద్ధి ఫోటోల ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గ్రామంలోని 1,500 కుటుంబాలను కలిశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే పాలన వచ్చిందని తెలిపారు. కోట్లాది రూపాయిలు వెచ్చించి ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించడంతో గ్రామాల స్వరూపం మారిపోయిందని తెలిపారు. జగనన్న పాలనలో రైతన్నల అభ్యున్నతికి పెద్దపీట వేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు.

సచివాలయ భవనం ప్రారంభం

పాపానాయుడుపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థినికి ఎమ్మెల్యే ల్యాప్‌టాప్ అందజేశారు. జయరాం కుమార్తె పద్మప్రియ ఇంజినీరింగ్ చదువుకుంటోంది. పేద కుటుంబానికి చెందడంతో తల్లిదండ్రులు తమ కుమార్తెకు ల్యాబ్‌టాప్ అందజేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. విద్యార్థినికి ల్యాబ్‌టాప్‌ను అందించి మధుసూదన్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ లలిత, ఎంపీటీసీలు మునిరాజా, నాగరాజురెడ్డి, మాజీ స్పంచ్‌లు తంబా సుబ్రమణ్యం, గోవిందస్వామి, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగళ్ బాలాజీరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, మాజీ సభ్యుడు చంద్రశేఖర్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, నాయకులు కరుణాకరన్, పరమాల చంద్రశేఖర్, లోకనాథరెడ్డి, సుధీర్‌కుమార్, మస్తాన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా పార్టీ నాయకులు ఆత్మీయ స్వాగతం పలికారు. క్రేన్ ద్వారా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని గజమాలతో సత్కరించి పూలవర్షం కురిపించారు.

కరోనాలోనూ ఆగని పథకాలు

రెండేళ్లు కరోనా సమయంలో కూడా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపకుండా అమలు చేశారని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. జగనన్నతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. జగనన్న పాలనలో బీసీలకు రాజకీయ పదవుల్లో సముచిత స్థానం కల్పించారని తెలిపారు. చంద్రబాబు నాయుడు హయాంలో బీసీలను అణగదొక్కారని చెప్పారు. బీసీలంతా ఏకమై మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కరోనా సమయంలో సొంత డబ్బు రూ.కోట్లు వెచ్చించి మాస్కులు, శానిటైజర్స్, నిత్యావసర సరకులు, కూరగాయలు, పౌష్టికాహారం ప్రజలకు పంపిణీ చేశారని చెప్పారు.



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ఆత్మీయ స్వాగతం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధు



సంక్షేమ ప్రగతి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే

నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి



పథకాల లబ్ధి వివరిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి తెలిపారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ దళితవాడ, విరూపాక్షపురం, మిట్టఇల్లు, గుండేలుగుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పాలన ఇలాగే కొనసాగాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయ్యేలా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గత పాలకులకు భిన్నంగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల కష్ట,సుఖాల్లో తోడుగా ఉన్నారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, కన్వీనర్ రవిబాబు, నాయకులు రంగయ్య, చెంగల్రాయరెడ్డి, వెంకటయ్యయాదవ్, గురవయ్యయాదవ్, మిట్ట భాస్కర్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, ధర్మారెడ్డి, మణి, చలపతి, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, కోవి చంద్రయ్యనాయుడు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లెలో బాలాజీ కుటుంబానికి సిపాయి భరోసా సాయం అందింది. ఇటీవల బాలాజీ(32)అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆదివారం ఆ గ్రామానికి వెళ్లారు. తన ఆధ్వర్యంలో నడుస్తున్న సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడే 52 రకాల నిత్యావసర సరకులను అందజేశారు. డాక్టర్ బాబు, వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న పథకాలు



రామాపురం ఇంటింటి ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: సీఎం వైఎస్ జగనన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకురాలు పవిత్రారెడ్డి అన్నారు. ఆదివారం సిద్ధం కార్య క్రమంలో భాగంగా మండలంలోని రామాపురం, దళితవాడ, అబ్బాబట్లపల్లి, దళితవాడ, ఎస్టీ కాలనీల్లో ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధితో నిరుపేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజలో పయనిస్తోందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. 30ఏళ్లలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరగని అభివృద్ధిని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నాలుగేళ్లలో చేసి చూపారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సొంత నిధులు వెచ్చించి ఎమ్మెల్యే అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. శ్రీకాళహస్తి కొండచుట్టు వెళ్లే మార్గాన్ని ఆధునికీకరించి, విడిది భవనాలను నిర్మిస్తున్నారన్నారు. పట్టణంలో భూగర్భ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఆయన ప్రజలతోనే ఉంటూ అన్ని విధాలా ఆదుకున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీనే ఆదరించాలని కోరారు. సర్పంచ్ పుట్టా బాలిరెడ్డి, నాయకులు రమణయ్య, సుబ్రామయ్య, మధురెడ్డి, మునిరత్నం, భాస్కర్, మురళి, మాతయ్య, బాలసుబ్రమణ్యం, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు సాయం



శ్రీకాళహస్తి: పట్టణంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధినేత మునీర్ ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 146 నెలలుగా ప్రత్యేక ప్రతిభావంతుకు నిత్యావసర సరుకులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. సభ్యులు శ్రావణి, బాబా పాల్గొన్నారు.

24న శ్రీవారి పాదాల ప్రతిష్ఠ

నాయుడుపేట టౌన్ : తుమ్మూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి ఆలయం వద్ద ఈ నెల 24న శ్రీవారి పాదాలను ప్రతిష్టించనున్నట్టు నిర్వాహకుడు జనార్దన్ తెలిపారు. హిమాలయాల్లో తపస్సు చేసుకునే శంబలనగరి మహర్షులు తపశ్శక్తి నింపిన పంచలోహ పాదాల ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తామన్నారు. ఈ వ్రతంలో పాల్గొనే దంపతులు ముందుగా 9110512229కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వ్రతానికి కావల్సిన పూజా సామగ్రిని తామే అందజేస్తామని తెలిపారు.

గీతామకరంద గుళికలు గ్రంథం ఆవిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సహస్రావధాని మేడసాని మోహన్ తదితరులు

తిరుపతి కల్చరల్: విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో రాస్ భవన్‌లో ఆదివారం డాక్టర్ గుడివాడ అన్నయ్య నాయుడు తెలుగులోకి అనువదించిన గీతామకరంద గుళికలు(శ్రీమద్భగవద్గీత) గ్రంథ ఆవిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహస్రవధాని డాక్టర్ మేడసాని మోహన్ పాల్గొని గీతామకరంద గుళికలు గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ గోవిందస్వామి నాయుడు గ్రంథ పరిచయం చేయగా, మేడసాని గ్రంథ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత ఆచార్య మధురాంతకం నరేంద్ర తన గురువైన అన్నయ్య నాయుడుతో తన మధుర జ్ఞాపకాలు గుర్తు చేశారు. భగవద్గీత శ్లోకాలను తేట గీత పద్యాలు, భావాలు అందించిన అన్నయ్య నాయుడిని పలువురు వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, సాహితీ వేత్తలు డాక్టర్ మాలేపాటి పురుషోత్తమాచారి, డాక్టర్ నెమలేటి కిట్టన్న, ఏనుగు అంకమ నాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ మన్నవ గంగాధర్ ప్రసాద్, గొడుగు చింత గోవిందయ్య, మూరిశెట్టి గోవిందు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్‌లోనూ డేటా సైన్స్‌దే ప్రధాన పాత్ర



ఎమ్మెస్సీలో టాపర్‌కు గోల్డ్‌మెడల్ అందజేస్తున్న ఇంటెలిజెన్స్ ఎస్పీ రామమోహన్

తిరుపతి సిటీ: పోలీస్ ఇంటెలిజెన్స్ విభాగంలోనూ డేటా సైన్స్ ప్రధాన పాత్ర వహిస్తోందని విజయవాడ ఇంటెలిజెన్స్ ఎస్పీ యూ.రామ మోహన్ తెలిపారు. ఆదివారం మహిళా వర్సిటీలో ఇండి యన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్(ఐఎస్‌పీఏస్), ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగం పూర్వ విద్యార్థులు, మహిళా వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో గణాంకాలు–డేటా సైన్స్‌లో పురోగతి అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ తాను స్టాటిస్టిక్స్ విద్యార్థినేనని, డేటా సైన్స్‌లో స్టాటిస్టిక్స్ పాత్ర ప్రముఖమైందన్నారు. రానున్న రోజుల్లో ప్రధాన భూమికకి పోషిస్తుందని చెప్పారు. స్టాటిస్టిక్స్ కాన్సెప్ట్, డేటా సైన్స్ ఆల్గరిథెమ్స్ మధ్య ఉన్న ఇంటర్నల్ సారూప్యతను ఆయన వివరించారు. అనంతరం 2022, 23వ బ్యాచ్‌కు చెందిన ఎస్వీయూ ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ విభాగంలో ప్రతిభ చూపి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులు జాహ్నవి, ప్రియాంకకు ఆయన గోల్డ్‌మెడల్స్ అందించారు. ఐఎస్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పి. రాజశేఖర్‌రెడ్డి, స్విమ్స్ సైన్స్ విభాగం డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, ప్రొఫెసర్ ఎస్ఆర్. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శివ పార్వతి, డాక్టర్ ఆర్ విష్ణువర్ధన్, పి.వెంకటేశన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చాముండేశ్వరిమాతా పాహిమాం..



ఊరేగింపులో చాముండేశ్వరి మాత



కళా ప్రదర్శన

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేటలో శ్రీచాముండేశ్వరిమాత ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. దేవాంగుల ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీరామలింగ చౌడేశ్వరిదేవిని మహిషాసురమర్దినిగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. శనివారం రాత్రి ప్రారంభమైన ఊరేగింపు బాణ సంచా పేలుళ్లు, మంగళ వాయిద్యాలు, డప్పుల మోతల్లు, కోలాటం, కర్రసాము, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామ వీధుల్లో ఆదివారం ఉదయం వరకు సందడిగా జరిగింది. మాదరపాకం, మానెల్లూరు, సత్యవేడు, సూళ్లూరుపేట, ఆరణి, చెన్నై, పాలగుంట, వరదయ్యపాళెం ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో జన సందోహంతో వీధులు కిక్కిరిశాయి. ఊరేగింపులో పిల్లలు, పెద్దలు, యువకులు చాముండేశ్వరిదేవి స్తోత్రాలను పఠించారు. శ్రీరామలింగ చౌడేశ్వరి ట్రస్టు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు దూరప్రాంతాల్లో ఉంటున్న స్థానికులు గ్రామానికి చేరుకోవడంతో కోలాహలం నెలకొంది.

ముక్కంటి సేవలో హెచ్‌పీ జస్టిస్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం హిమాచల్ ప్రదేశ్ హైకోర్ట్ చీఫ్ జడ్జి జస్టిస్ రామచంద్రరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులతో ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. పోలీసులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయంలో కుటుంబ సభ్యులతో రామచంద్రరావు

వాలీబాల్ విజేతలకు బహుమతులు



విజేతజట్టుకు మెడల్, కప్ అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ప్రాథమిక పాఠశాలలో వాలీబాల్ విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. యువనేస్తం అసోసియేషన్ సంస్థ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు జరిగాయి. నాదముని జట్టుపై అర్జున్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు మెడల్‌తో పాటు కప్ అందజేశారు. సర్పంచ్ మంజుల, యువనేస్తం సంస్థ వ్యవస్థాపకుడు మునిశేఖర్, వినోద్, జస్వంత్, దొరబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం



నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి: ముదిరాజ్ సంఘం నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వైవీ రమణయ్య, గౌరవాధ్యక్షులుగా పిళ్లారి బత్తినయ్య, ఎస్.అంకయ్య, జి.రాజేంద్ర, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా గోవిందస్వామి, ఉపాధ్యక్షులుగా వెంకటరత్నం, కె.నాగరాజు, కేవీ సుబ్రమణ్యం, ప్రచార కార్యదర్శిగా ఆర్.సుబ్రమణ్యం, యువత అధ్యక్షుడిగా ఆకుల గురుమూర్తి, పట్టణ అధ్యక్షుడిగా కోనేటి అయ్యప్ప, అధికార ప్రతినిధిగా రాజా, జాయింట్ సెక్రటరీలుగా తిరుపాల్, అయ్యప్ప, కోటి, సురేంద్రను ఎన్నుకున్నారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్లుగా శేఖర్, గురవయ్య, గౌరవ సలహాదారుగా కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పీవీపురంలో దుమ్మురేపిన జల్లికట్టు



దూసుకెళ్తున్న కోడెగిత్తలు



ఉరకలేస్తున్న కోడెగిత్త

రామచంద్రాపురం: మండలంలోని పీవీపురంలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. వందల మంది జనంతో గ్రామం జనసంద్రమైంది. ఉదయం పశువుల కొమ్ములకు రంగులను పూసి అందంగా తయారు చేశారు. కొయ్యతో చెక్కిన పలకలు, రంగు కాగితాలు, వివిధ రకాల దేవుళ్ల బొమ్మలను అతికించి, డప్పులు కొట్టి పశువులను జనంలోకి వదిలారు. యువకులు పశువులను నిలువరించి వాటి కొమ్ములకు ఉన్న బహుమతులను సొంతం చేసుకోవడానికి పోటీ పడ్డారు. కొంతమంది పశువుల యజమానులు తమకు నచ్చిన నాయకుల చిత్రాలను, వివిధ దేవుళ్లను బొమ్మలను పలకలకు అతికించారు. అనంతరం జల్లికట్టు తిలకించడానికి వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు.

కండలేరులో 10.809 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 10.809 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 280 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.